సంతకం పెట్టే ఓపికకూడా లేని దీర్ఘరోగికి కూడా పట్టం కడతారిక్కడ. ప్రజలసొమ్ముతో అమెరికా వెళ్ళి ఆరోగ్యం కొనుక్కోవచ్చు. నీతి నిజాయితీ సామర్ధ్యం కూడా వుండనక్కరలేదు. సొంతపనులొదిలేసి పక్కపార్టీల్ని పడగొట్టటం చేతనయితేచాలు అందుకే రాజకీయాల్లో చేరటానికి లుచ్ఛాతనమే గొప్ప అర్హత.

ప్రాణమిత్రుడ్ని దెబ్బకొట్టి మనం పరమనీచులమవుతున్నాం. ఒక్కసారయినా, వెయ్యిసార్లయినా ఒకటే... అందుకే అంటున్నాను.

నిన్ను విమర్శించటానికి కాదు. నువ్వు రాజకీయాల్లో చేరు. ఆ వేపునుంచి జనాన్ని నంజుకుతింటూ రా, నేను ఇటువేపు మరో వ్యాపారాన్ని ఆరంభిస్తాను.

అదే ఫైనాన్స్ అండ్ ఇన్‌వెస్టుమెంట్ బిజినెస్. ఇరవై ముప్పయి శాతం వడ్డీలని పిచ్చిజనాల్ని నమ్మించి నట్టేట్లో ముంచేసి నీ వెనకొచ్చి దాక్కుంటాను. కాని ఒకటి గుర్తుపెట్టుకో. ఎవరెంత సంపాదించినా చెరిసగం పంచుకోవాలి ఓకె..." మధుమూర్తి తన ఎనాలసిస్ చెప్పుకుపోయాడు.

పట్టాభి ఆలోచనల్లో పడ్డాడు.

మొత్తనికి ఓ గంటకి యిద్దరు ఓ ఒప్పందానికొచ్చారు.

పట్టాభిది రాజకీయ వ్యాపారం. మధుమూర్తిది ప్రలోభ వ్యాపారం.

లాభం చెరిసగం.

ఇద్దరూ సాధ్యమైనంత ఎక్కువ మందిని మోసం చేసి ముంచెయ్యాలి.

పట్టాభిని గెలిపించే పని మధుమూర్తి ది. మధుమూర్తిని చట్టంనుండి రక్షించే బాధ్యత పట్టాభిది.

ఇద్దరు ఆనందంగా మరోసారి ఛీర్స్ చెప్పుకున్నారు.

దుర్గాదాసులాంటి పరమకిరాతకుడు కూడా వారి ఒప్పందం విని ఉలిక్కిపడ్డాడు.

0 0 0

రెండోరోజు... ఉదయ్ ఎప్పటిలా నాలుగున్నరకి స్కూలునుంచి బయటికొచ్చాడు.

రాజర్షి అతన్ని అనుసరించసాగాడు.

ఈ లోపు రాజర్షి అనుచరులు ఆ ఊర్లో ఏకైక సినిమాహాలుకి వెళ్ళి మేనేజర్‌తో మాట్లాడి కొన్ని సినిమాపేర్లు చెప్పి వాటినే ఆడించమని కొంతసొమ్ము అప్పజెప్పారు.

మర్డర్స్ చేసేది హీరోయే, అసలు మర్డర్స్ చేస్తే హీరో అవుతాడని చెప్పే గొప్ప సందేశాత్మక చిత్రరాజాల్ని సెలక్టు చేసి పెట్టారు.

ఒక పథకం ప్రకారం పనులు ఒక్కొక్కటి జరిగిపోతున్నాయ్.

రాజర్షి రెండోరోజు కూడ ఉదయ్‌ని అబ్జర్వ్ చేయడానికే ఉపయోగించుకుంటున్నాడు.

మూడోరోజు...సరిగ్గా నాలుగున్నరకు ఉదయ్‌తో మాట కలిపాడు రాజర్షి.

కేవలం అరగంటలోనే ఉదయ్‌ని రాజర్షి మచ్చిక చేసుకోగలిగాడు.

"నువ్వు పెద్దయ్యాక ఏం కావాలనుకుంటున్నావు?" రాజర్షి ఉదయ్‌కేసి అభిమానంగా చూస్తూ అడిగాడు.

"బాగా చదువుకుని, మంచిపేరు తెచ్చుకుని అమ్మా నాన్నా. ఆనందించేలా మంచి ఉద్యోగంలో చేరాలనుంది అంకుల్" ఉదయ్ పసిమోములో తల్లిదండ్రులపట్ల గౌరవభావం స్పష్టమైంది.

"ఇంకా?"

"ఇంకా... మంచి బట్టలు కొనివ్వాలి"

రాజర్షి కొద్దిసేపు మౌనం వహించాడు.

"అంటే డబ్బు కావాలి కదా?" రాజర్షి గాలం వేస్తున్నాడు.

"అవును"

"మరి డబ్బెలా సంపాదిస్తావ్?"

"బాగా చదువుకుంటే ఉద్యోగం వస్తుంది. ఉద్యోగం చేస్తే డబ్బు వస్తుంది" ఉదయ్ అమాయకంగా అన్నాడు.

వాళ్ళిద్దరిప్పుడు మామిడితోపులో ఓ చెట్టు కింద కూర్చున్నారు. సాయం చీకట్లు ముసురుకుంటున్నాయి. ఉదయ్‌కి యింటి ధ్యాస పట్టుకుంది.

"చదువుకున్న వాళ్ళకు ఉద్యోగాలు ఎక్కడున్నాయి? అయినా ఉద్యోగం డబ్బు ఏ మూలకి సరిపోతుంది?" రాజర్షి చుట్టుప్రక్కల చూస్తూ అన్నాడు.

"మా  నాన్నలా బిజినెస్ చేస్తాను" ఉదయ్ తిరిగి అన్నాడు.

"మీ నాన్నకి వ్యాపారంలో వచ్చింది నష్టమేగా?"

"మరెలా అంకుల్?" ఉదయ్ నిరుత్సాహంగా చూస్తూ అన్నాడు.

" నువ్వు పెద్దయి బాగా డబ్బు సంపాదించాలి. హీరో అని పేరు తెచ్చుకోవాలి. కేవలం డబ్బే సంపాదిస్తే నీ గురించి నలుగురు గొప్పగా ఎలా చెప్పుకుంటారు? ధనవంతుడనే అంటారు. ఈ ప్రపంచంలో ఎంతమంది ధనవంతులు లేరు? వాళ్ళందరి గురించి గొప్పగా చెప్పుకుంటున్నారా?"

అతని మాటలపై ఉదయ్‌కి గురి కుదిరింది "హీరో కావాలంటే ఏం చేయాలంకుల్?" జిజ్ఞాసగా అడిగాడు.

"నేను చెప్పేకన్నా చూస్తేనే బాగా అర్థమవుతుంది పద" అంటూ అతని ముందుకు కదిలాడు.

అది తొమ్మిదో రోజు.

గత నాలుగురోజులుగా రోజుకో సినిమా చొప్పున చూపిస్తున్నాడు అతను ఉదయ్‌కి.

ఉదయం క్లాసుల్ని పూర్తిచేసుకున్న ఉదయ్ ఎవరి కళ్లలో పడకుండా తప్పించుకుని వచ్చి రాజర్షిని కలుస్తాడు. అక్కడినుండి ఆ ఇద్దరూ సినిమా థియేటర్‌కేసి సాగిపోతారు.

ఓ రోజు వున్నట్టుండి అడిగాడు ఉదయ్ "అంకుల్! నేను స్కూల్‌కి వెళ్ళటం లేదని మా నాన్నగారికి తెలిస్తే?"

"తెలియదు. అలా మీ మాష్టార్ని మేనేజ్ చేశాను. త్వరగా పద. దొంగతనాలు చేసిన ఓ కుర్రాడు పెద్దయ్యాక ఎలా హీరో అయ్యాడో చద్దూగాని" అతను హడావుడి చేశాడు.

రోజూ అనుచరులకు, పట్టాభి, మధుమూర్తిలకు అతని పథకం ఏమిటో ఎంతమాత్రం అర్థం కాలేదు. పట్టాభికయితే మరీ చిరాకుగా వుంది.

"పరమశివాన్ని, శశిభూషణ్‌ని రాజర్షి దెబ్బకొడతాడని ఎంతో ఆశగా ఎదురుచూస్తుంటే అతనేమో పరమశివం కొడుకుతో స్నేహం చేస్తూ సినిమాలు చూపిస్తూ కాలయాపన చేయటం అంతా గందరగోళం అనిపిస్తుంది."

"మా గురువుగారు ఏ పనిని వృధాగా చేయరు. ఏ పథకం ఎదురుతిరగదు.

ఆయన పథకమేమిటో మనకర్థం కానంత మాత్రాన తక్కువ అంచనా వేయటం మనకే ప్రమాదకరం" ఒక అనుచరుడన్నాడు ఒకింత సీరియస్‌గా.

"అవుననుకోండి. కాని బుడ్డోడు ఘటికుడు. పరమశివం అంతకంటే ఘటికుడు" మధుమూర్తి గొణిగాడు.

"మాకు గురువుగారి పథకం అంతుబట్టడంలేదు. అయినా ఆయన పెట్టిన గడువు పదిరోజులు. ప్రపంచం తలక్రిందులయినా ఆయనేసుకున్న పథకం బెసకదు. సరిగ్గా పదిరోజుల్లో పరమశివం, శశిభూషణ్ వినాశనాం తథ్యం ఇంకొక్కరోజే వుంది".

"ఇంతకాలం ఆగినవాళ్ళు మరొక్కరోజు ఆగలేరా?" మరో అనుచరుడన్నాడు.

0 0 0

"అంకుల్! నాకు హీరో కావాలనుంది, ఏం చేస్తే అవుతాను?" అమాయకంగా అడుగుతున్న ఉదయ్‌కేసి చూసిన రాజర్షి ఓ క్షణం కలవరపడ్డాడు.

తండ్రి చేసిన అన్యాయానికి అమాయకుడయిన కొడుకును బలి గొంటున్నానా?

కావచ్చు. అయినా తప్పదు.

పట్టాభి, మధుమూర్తిలకు జరిగిన అన్యాయానికి తగిన శిక్ష ఇదే.

"ఏదో ఒక సాహసం చేసి నలుగురి దృష్టిలో పడాలి"

"అంటే ఎలా?"

ఉదయ్‌కి ఉత్సాహంగా వుంది.

రాజర్షి చెప్పేది ఏదయినా చేసి హీరోననిపించుకోవాలి.

పొద్దు ఏటవాలుతోంది. మామిడితోపు నిశ్శబ్దంలోకి జారుకుంది. ఎక్కడో దూరంగా తీతువుపిట్ట వున్నట్టుండి రెక్కల్ని టపటపలాడిస్తూ హృదయవిదారకంగా అరిచింది.

భయంగా చూశాడు ఉదయ్.

మనిషి అభివృద్ధికి అతని పిరికితనమే అడ్డుకట్ట వేస్తుంది. అతను ఉదయ్‌ని ఓ క్రమపద్ధతిలో రెచ్చగొట్టుకుంటూ వెళుతున్నాడు. ఉదయ్ తిరిగి ధైర్యాన్ని కూడగట్టుకుంటున్నాడు.

"ఎన్.టి.ఆర్., ఏ.ఎన్.ఆర్., చిరంజీవి, క్రిష్ణ, శోభన్‌బాబు, బాలకృష్ణ, నాగార్జున ఎలా హీరోలయ్యారు?"

"మంచి చేసి" ఉదయ్ తను చూసిన సిమాల్లోని పాత్రల్ని గుర్తుకు తెచ్చుకుంటున్నాడు.

"మంచంటే చెడును చంపే కదా?" రాజర్షి ఉదయ్ వెన్నుని లాలనగా నిమురుతూ అన్నాడు.

"అవునూ"

"సో! నువ్విప్పుడు చెడును చంపాలి. అవునా?"

"అవును....చెడంటే?"

"సినిమాల్లో చూడలేదా?"

"చూశాను"

"హీరో కావాలనుకునేవాడికి తెలివితేటలుకూడా వుండాలి"

"అవునవును"

"ఒక దొంగతనం చేసినా సాక్ష్యాధారాలు లేకుండా చేయాలి... ఒక మర్డర్ చేసినా అలాగే చేయాలి, నువ్వే చేశావని తెలిసినా ఇన్ స్పెక్టర్ ఏం చేయలేక చేతులు నలుపుకున్నాడనుకో అప్పుడు యేమవుతుంది?"

"జనాలు చప్పట్లు కొడతారు" ఉదయ్ ఉత్సాహంగా అన్నాడు.

"శభాష్! అదీ తెలివంటే... అలాగే యాభయిమంది రౌడీల్ని ఒక్కడే చావచితక్కొట్టాలి. సినిమాలో చూడలేదా?"

"చూశాననుకో ఆంకుల్! కాని అదెలా? ఒక్కడే అంతమందిని ఎలా కొట్టగలడు?"

"నిజజీవితంలో కొట్టేవాళ్లుండబట్టేకదా సినిమాల్లో అలా పాత్రలు చూపెడుతున్నారు!

సినిమాల్లో కేవలం కొట్టినట్లు చూపిస్తేనే థియేటర్‌లో జనాలు నాణాలు, పిచ్చికాగితాలు, పూలు తెరమీద చల్లుతున్నారంటే నిజంగా నిజజీవితంలో అంతటి సమర్థుడయితే?"

"భలే వుంటుందంకుల్!"

"సినిమాలో హీరోల్ని చూశావా ఎంత తెలివిగా దొంగతనం చేస్తారో?"

"అవునంకుల్! గూర్ఖాను కొట్టి, స్పృహ తప్పించి దొంగతనం చేస్తారు?"

"మరి పోలీసులు ఆ సమయంలో వచ్చారా?"

"రాలేదు. అంతా అయ్యాక వస్తారు. అవునంకుల్! అప్పటిదాకా పోలీసులేం చేస్తారు? దొంగతనం జరిగాక, హీరో విలన్స్‌ని కొట్టాక గాని రారు. ఎందుకని?"

“పాపం పోలీసోళ్ళు చాలా మంచివాళ్ళు. ముందే వాళ్ళు వచ్చారనుకో, హీరోకి పేరు రాదని ఆఖరులో వస్తారు”

“రహస్యంగా దొంగల్ని పట్టుకునేందుకు పోలీసులు వచ్చేటప్పుడు నిశ్శబ్దంగా వచ్చి చటుక్కున పట్టుకోవాలి కదా? మరి ముందే తాము వస్తున్నట్లు తెలిసేలా పోలీసు సైరన్ మోగిస్తారెందుకు?”

రాజర్షి ఉదయ్ వేపు చిరునవ్వుతో చూశాడు “దొంగల్ని దొంగల్లా వెళ్ళి చటుక్కున పట్టుకుంటే పేరు రాదు ఉదయ్! అందుకే దొంగలు పారిపోయేందుకు హింట్ యిచ్చి పారి పోతే దొంగల్ని దొరల్లా పట్టుకునేందుకు ప్రయత్నిస్తారు.”

రాజర్షి ఓసారి వాచీవేపు చూసుకున్నాడు.

“ఇంతకీ నేను హీరో కావాలంటే ఏం చేయాలి ఆంకుల్.”

“చిన్న మర్డర్ చేయాలి”

“అమ్మో! తప్పు కదా?” ఉదయ్ కళ్ళు భయంతో పెద్దవయ్యాయి.

“పెద్ద హీరో కావాలంటే మొదట్లో చిన్న చిన్న తప్పులు చేయాలి. హీరో అయ్యాక అన్నీ మంచి పనులే కదా చేస్తావు?”

ఉదయ్ పసి మనస్సు సంఘర్షణకు లోనయింది. అతని మస్తిష్కం పై సినీ హీరోలు చేసే సాహసకృత్యాలే ముద్ర వేసుకున్నాయి.

రాజర్షికి తెలుసు ఉదయ్ మెదడును సినిమాలు తినేస్తాయని. తాను వేసుకున్న పథకం ఈ రోజుతో పూర్తయిపోవాలి. ఇంకా అలస్యం చేయరాదు.

“త్వరగా తేల్చుకో. ఎందుకంటే నేను రేపు ఊరికెళ్ళాలి. హీరో కావాలంటే ఓ చిన్న మర్డర్ చేయక తప్పదు. లేదంటే చెప్పు. నేనెళ్ళిపోతాను మరో కుర్రాడ్ని హీరోను చేస్తాను. కాకపోతే నువ్వెందుకో నాకు బాగా నచ్చావ్. అందుకనే చూస్తున్నాను.”

ఉదయ్ ఆలోచనలను రాజర్షి మాటలు విషపూరితం చేయటం ఆరంభమైంది.

పదినిముషాలు ఎవరూ ఏం మాట్లాడకుండానే గడిచిపోయాయి.

ఇంతదాకా వచ్చి యిప్పుడు ఉదయ్ వెనక్కి తిరిగితే? ఇది ఉపయోగించుకోకపోతే ఎప్పటికీ హీరో కాలేనేమో?

“సరే ఆంకుల్! నేను మర్డర్ చేస్తాను” అన్నాడు స్థిరంగా ఉదయ్.